118 జీఓతో దీర్ఘకాలిక రిజిస్ట్రేషన్ సమస్యకు పరిష్కారం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


కన్వీనియన్ డీడ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో దశాబ్దాల తరబడి పెండింగ్ ప్లాట్లు, ఇళ్ల క్రమబద్ధీకరణ సమస్యకు జీఓ 118 తో శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ పరిధిలోని శుభం ప్యాలెస్‌లో బుధవారం తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రర్లతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసి బాధిత కాలనీ వాసులకు జీఓ 118 పై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కన్వీనియన్ డీడ్‌లోని షెడ్యూల్ ఆఫ్ ప్రాపర్టీ ఆప్షన్‌లో 118 జీఓ ప్రకారం ఇంటి నెంబరు, ప్లాట్ సరిహద్దుదారుల పేర్లు ఉండాల్సిన అవసరం లేదని, వాటి వివరాలు కూడా తప్పని సరిగా ఉండాలి అనుకునే వారు ఫామ్–32 దరఖాస్తులో పూర్తి వివరాలను పొందుపరచి బాధిత కాలనీ పరిధిలోని ఎంఆర్ఓ ఆఫీస్‌లో ఇవ్వాలన్నారు. పెండింగ్ రిజిస్ట్రేషన్ సమస్యలను ఎదుర్కొంటున్న కొన్ని ఇళ్లు, ప్లాట్లను అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో పరిశీలించారని వారికి ఇప్పటికే కన్వీయాన్స్ డీడ్ అందించటం కూడా జరిగిందన్నారు. వెరిఫికేషన్ పూర్తయి డిమాండ్ నోటీసులు రానివారు ఆందోళన చెందకుండా ఈ–సేవ, మీ–సేవలో పరిశీలించుకోవాలని సూచించారు. సబ్ రిజిస్ట్రర్లు మధుసూధన్‌రెడ్డి, జహంగీర్, నాయకులు నల్లా రఘుమారెడ్డి, గౌతంరెడ్డి, ఉప్పల్, సరూర్‌నగర్, హయత్‌నగర్ మండల పరిధిలోని బాధిత కాలనీ వాసులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

వనస్థలిపురం: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎస్ఎస్ రోలర్ అండ్ ఇన్‌లైన్ హాకీ క్లబ్ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో బుధవారం వనస్థలిపురంలోని స్కేటింగ్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో ఇన్‌లైన్ హాకీ ఇండియా జట్టుకు ఎంపికైన విద్యార్థుల అభినందన సభకు ఆయన హాజరై మాట్లాడారు. క్లబ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు టంగుటూరి నాగరాజు ప్రోద్బలంతో వనస్థలిపురంలో స్కేటింగ్ గ్రౌండ్‌ను అభివృద్ధి చేసుకోవడం జరిగిందని ఇక్కడ శిక్షణ పొందిన ఐదుగురు విద్యార్థులు శ్రీమాన్, నందిత, శ్రీపత్, సాయిచంద్ర, తన్మయ్ ఇండియా జట్టుకు ఎంపిక కావడం హర్షనీయమన్నారు. జిట్టా రాజశేఖర్‌రెడ్డి, చింతల రవికుమార్, ఆనంద్‌రాజ్, రాజిరెడ్డి, కోచ్‌లు సత్యం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నాగోలు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. కొత్తపేట విలేజ్‌లో దళిత మోర్చా అధ్యక్షుడు గట్టు మహేష్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొని స్థానికులతో కలిసి చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తపేట డివిజన్‌ను స్వచ్ఛ డివిజన్‌గా చేయడమే ప్రధాన ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. కాలనీ ప్రజలు బాధ్యతాయుతంగా తమ ఇళ్లలోని చెత్తను రోడ్లపైన పారవేయకుండా స్వచ్ఛ ఆటోలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓం ప్రకాష్ బిశ్వ, రామకృష్ణ, తిరుమల, వెంకటేష్, సాయికుమార్, నిఖిల్, సాయి కిరణ్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, ప్రజలలో పెరుగుతున్న ఆదరణను ఓర్వలేకనే ప్రతిపక్షనేతలు ఆరోపణలు చేస్తున్నారని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ ధ్వజమెత్తారు. బుధవారం హస్తినాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపి అధ్యక్షులు సామ రంగారెడ్డి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం తగదన్నారు. డివిజన్ పరిధిలోని బైరామల్‌గూడ రెవెన్యూ పరిధి సర్వేనంబర్ 24లోని 13 గుంటల భూమిలో పది గుంటల భూమి పార్కుకు కేటాయించారని మిగతది ఎమ్మెల్యే అనుచరులు ఆక్రమించుకుంటున్నారని దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, సామ రంగారెడ్డి చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. సాగర్ ప్రధాన రహదారిపై సర్వే నంబర్ 22లో ఓ వ్యాపారికి చెందిన 3303 గజాలలో 1120 గజాలు ప్రభుత్వ భూమిగా గుర్తించారని అందులో 728 గజాలు భూసేకరణలో పోగా ప్రభుత్వం నుంచి అందుకు డబ్బులు తీసుకున్నారని మిగతా 1455 గజాలు వ్యాపారికి పోను మిగతాది ఎంత భూమి ఉంటే అంత మొత్తం ప్రభుత్వానికే చెందుతుందని కార్పొరేటర్ పేర్కొన్నారు. ఆ భూమిపై ఏమాత్రం అవగాహన లేకుండా, పూర్తి సమాచారం తెలియకుండా ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని సుజాతనాయక్ హెచ్చరించారు. ఈ సమావేశంలో గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నారగోని శ్రీనివాస్‌యాదవ్, కంచర్ల శివారెడ్డి, నాగిరెడ్డి, సయ్యద్ పాషా, ఆదిలక్ష్మీ, భిక్షపతిచారి పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


దీప్తిశ్రీ

వనస్థలిపురం: ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం ఫలితాల్లో వనస్థలిపురంకు చెందిన టురిటో జూనియర్ కళాశాల విద్యార్థిని ఏ.దీప్తిశ్రీ 436/440 సాధించి రాష్ట్ర స్థాయిలో 2వ స్థానం నిలువగా ఎంపీసీలో కే.వైష్ణవి 463 /470 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఉదయ్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ టి.స్వామి విద్యార్థినులు సత్కరించి అభినందించారు.

జలమండలి తీరును నిరసిస్తూ కార్పొరేటర్ నిరసన

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలో పలు కాలనీలలో డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని ఏడాది కాలంగా చెపుతున్నా జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆరోపించారు. జలమండలి అధికారుల తీరును నిరసిస్తూ బుధవారం ఆయన పలు కాలనీల ప్రజలతో కలిసి వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లోని జీఎం కార్యాలయంలో నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. బతుకమ్మ కుంట వద్ద డ్రైనేజీ వ్యవస్థ కోసం తవ్వకాలు జరిపి పనులు చేపట్టక పోవడంతో రాత్రివేళ వాహనదారులు గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారని అలాగే ఎన్జీవోస్‌కాలనీ, గౌతమినగర్, వైదేహినగర్ తదితర కాలనీలలో చాలా కాలంగా డ్రైనేజీ సమస్యలు వేధిస్తున్నాయన్నారు. జీఎం వినోద్ మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల పనుల్లో ఆలస్యం జరుగుతోందని పనిచేయని కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వడం జరిగిందని, యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి త్వరగా పూర్తయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. సామ రంగారెడ్డి, భూపాల్‌రెడ్డి, శంకరయ్యగౌడ్, సందీప్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, విష్ణువర్ధన్ రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, ముత్యాలు, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గౌడ కులస్తుల అభ్యున్నతికి కృషి

నాగోలు: గౌడ కులస్తుల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని గీతా కార్మిక కార్పొరేషన్ నూతన చైర్మన్ ఎన్నికైన పల్లె రవికుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం గీతా కార్మిక కార్పొరేషన్ చైర్మన్ ప్రమాణ స్వీకారానికి వెళ్లే ముందు నాగోలు రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగోలు గీత సహకార సంఘం ఆధ్వర్యంలో నాగోలు చెరువు వద్ద నిర్వహించిన హరితహారంలో పాల్గొని ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమ కోసం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రావులరాజుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, పల్లె సీతారాములుగౌడ్, కట్ట ఈశ్వరయ్యగౌడ్, బద్దం దనంజయ్యగౌడ్, బద్దం వెంకటేష్‌గౌడ్, బద్దం మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.



పది ఫలితాల్లో 'నాగార్జున' సత్తా

వనస్థలిపురం: పదో తరగతి ఫలితాల్లో నాగార్జున విద్యా సంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగరవేశారని సంస్థ చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి తెలిపారు. 44 మంది విద్యార్థులు 10 జీపీఏ, 53 మంది 9.8 జీపీఏ, 200 మంది 9.5 జీపీఏ, 398 మంది 9.0 జీపీఏకు పైగా సాధించారన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆయన పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

భాష్యం విద్యార్థులు..



చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ భాష్యం ఐదుగురు విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారని విద్యా సంస్థల జెడ్ఈఓ అంకమ్మరావు తెలిపారు. 11 మంది 9.8, తొమ్మిది మంది 9.7, 61 మంది పైగా విద్యార్థులు 9.0 సాధించారని అన్నారు. గురువారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ పల్లవి విద్యార్థులను ప్రిన్సిపల్ భానుమతి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా త్యాగరాజ స్వామి జయంతి



దిల్‌సుఖ్‌నగర్: రామకృష్ణాపురం డివిజన్, అల్కాపురి కాలనీలో భారతీయ కళా సమితి ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి 226వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వారం రోజులు నిర్వహించిన వేడుకలు గురువారంతో ముగిసాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ దీపికారెడ్డి, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి చక్రవర్తి పాల్గొన్నారు. అల్కాపురి కాలనీలో విధుల్లో తిరు గుతూ సంకీర్తనలు ఆలపించారు. వారు మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా భారతీయ కళా సమితి వారు ప్రతి ఏటా సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి వారి జయంతి ఉత్సవాలను అల్కాపురి కాలనీలో నిర్వహిస్తున్నారు. సంగీతానికి ఎంతో గొప్ప శక్తి ఉందని మనస్సుకు ఎంతో ఆహ్లాదాన్ని కలిగించేది సంగీతం అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత విద్యాంసులు నగేష్‌కు సంగీత భారతి బిరుదు ప్రదానం చేశారు.నిర్వాహకులు తాండవకృష్ణ, నరసింహారావు, ప్రముఖ్య విద్యాంసులు శేషాచారి, రాఘవాచారి, నింజనా శ్రీనివాసన్, సుధా, బాలచందర్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

మలక్‌పేట: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి ఓ వరం లాంటిదని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. చార్మినార్ మండల పరిధిలోని ఫర్హత్‌నగర్, హరిజన్ బస్తీ, ఆజంపుర ప్రాంతాలకు చెందిన పలువురికి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులు ఆయన అందజేసి మాట్లాడారు.

విద్యార్థిని ఆత్మహత్య



హస్తినాపురం: ఇంటర్ ఫలితాల్లో తప్పడంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. నల్గొండ జిల్లా నాంపల్లి మండలం మల్లెవాయిగ్రామానికి చెందిన వేముల గాయత్రి (17) మెడికల్ అండ్ హెల్త్‌కాలనీలో ఉంటూ హస్తినాపురంలోని ఓ కళాశాలలో మొదట సంవత్సరం చదువుతుంది. ఫలితాల్లో ఫెయిల్ కావడంతో బుధవా రం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

'భారతి అల్ట్రాఫాస్ట్'తో నిర్మాణ ప్రక్రియ వేగవంతం


బాండ్లు అందజేస్తున్న నితీష్‌యాదవ్

హస్తినాపురం: సిమెంటు వ్యాపారంలో తిరుగులేని శక్తిగా ఎదుగుతున్న భారతి సిమెంటు అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంటును తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ నితీష్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం శ్రీవిష్ణు సిమెంట్ ట్రేడర్ డీలర్ షాపులో నిర్వహించిన తాపీ మేస్త్రీల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ముఖ్యంగా స్లాబులు ఫ్లిలర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అని అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందిస్తామని స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంటు ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయ పడతారని వెల్లడించారు.ఈ సందర్భంగా 50 మంది తాపీ మేస్త్రీలకు రూ. లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. డీలర్ రాంరెడ్డి మాట్లాడుతూ భారతి సిమెంటు సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఆఫీసర్స్ సహేర్, బద్రీ, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి చేస్తాం

మన్సూరాబాద్: ఈ 7న సరూర్‌నగర్ స్టేడియంలో బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ భరోసా సభను విజయవంతం చేసిన ప్రతి కార్యకర్త, సభకు హాజరైన అభిమానులకు బీఎస్పీ ఎల్‌బీనగర్ అధ్యక్షుడు గువ్వల సాయిరామ్‌కృష్ణ ధన్యవాదలు తెలిపారు. ఎల్‌బీనగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సీఎం అభ్యర్థిగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ప్రకటించడం కార్యకర్తల్లో నూతనోత్సాహం పెరిగిందని బీఎస్పీ పార్టీని బలంగా ప్రజల్లో తీసుకెళ్లి రాబోయే ఎన్నికల్లో బహుజన రాజ్యం స్థాపనకు కష్టపడి పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్‌యాదవ్, సంపత్, రవికుమార్, దాసరి వినయ్, పవన్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

మలక్‌పేట: డివిజన్‌లోని రోడ్లను సుందరంగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపట్టినట్లు మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చి వెనుక లైన్ నుంచి శాలివాహననగర్ మాక్సివిజన్ చౌరస్తా వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు పనులు బుధవారం కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. రోడ్డు నిర్మాణం కోసం రూ. 30 లక్షలు జీహెచ్ఎంసీ నిధులు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. మూసారంబాగ్‌ను అభివృద్ధి చేయడంలో రాజీ పడే ప్రసక్తి లేదని కాలనీవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు.

జ్యోతిషులు ధర్మానంద స్వామిజీ మృతి



సైదాబాద్: ప్రముఖ జ్యోతిషులు ధర్మానంద స్వామిజీ అనారోగ్యంతో మృతి చెందారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు చెందిన ఉపాధ్యాయుడు ధర్మారెడ్డి (71) జ్యోతిషం, ఫేస్ రీడింగ్‌లో నిపుణులు. ఐఎస్‌సదన్ డివిజన్ సరస్వతీ నగర్ కాలనీలో నివసించే ఆయనకు భార్య భాగ్యలక్ష్మీ, ఒక కూతురు, కొడుకు ఉన్నారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం ఇంటిలోనే తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి పలువురు నాయకులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలి

చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ మున్సిపల్ కాలనీలోని ప్రభుత్వ స్థలం కబ్జా కాకుండా పరిరక్షించాలని ఉదయ్‌నగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీను, విజయ్‌కుమార్, సలీం, అమర్‌నాథ్‌గౌడ్, రత్నాకర్ మాట్లాడారు. మున్సిపల్ కాలనీలోని మీ సేవా కేంద్రం వెనుక 200 గజాల స్థలం ఖాళీగా ఉండటంతో ఓ వ్యక్తి కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నాడని తెలిపారు. కబ్జా అడ్డుకోవాలని అంబర్‌పేట తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా సర్వే చేయించి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని 2021లో జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్–6 ఉప కమిషనర్ ఆదేశాలు జారీ చేసినట్లు గుర్తు చేశారు. ఆదేశాలు జారీ చేసి ఏడాది గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలన్నారు.